ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025



జీఎస్టీ తగ్గింపుతో మీ జీవితాలనే మార్చేశామంటూ ప్రధాని నరేంద్ర మోడీ మొదలు రాష్ట్రంలోని కూటమి నేతలందరూ ప్రతి రోజు ఊదరగొడతున్నారు. అయితే ఇదంతా ప్రచార ఆర్భాటమే అనేలా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఉంది. చాలా రకాల మందులు, నిత్యావసరాలకు తగ్గిన జీఎస్టీ అమలు కావడం లేదు. పాత ఎంఆర్పీ ప్రకారమే వీటిని వ్యాపారులు విక్రయిస్తున్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అంటూ అధికార యంత్రాంగం చేస్తున్న హడావుడి ప్రచారానికే పరిమితమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచార ఆర్భాటానికి ఇచ్చిన ప్రాధాన్యత కొత్త జీఎస్టీ ఫలాలను ప్రజలకు అందించే దిశగా చర్యలు తీసుకోలేకపోవడం గమనార్హం.



మాటల్లోనే జీఎస్టీ తగ్గింపు..!



- పాత ఎమ్మార్పీకే విక్రయాలు
- ఔషధాల ధరల్లో ఒక్క రూపాయీ తగ్గని వైనం
- నిత్యావసరాల పరిస్థితి అంతే
- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రచారానికే పరిమితం
- చోద్యం చూస్తున్న అధికారులు
- క్షేతస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి-పెనుకొండ

పలు ఔషధ మందులపై 12, 18, 6.25, 11.02, 5 శాతం జీఎస్టీ ఉండేది. వీటిన్నంటిపై ఆయా మందులను బట్టి 4 నుంచి 12 శాతం వరకు జీఎస్టీని కేంద్రం తగ్గించింది. కొన్ని రకాల మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దయ్యింది. అయితే రద్దైన జీఎస్టీ అమలు చేయకుండా పాత ధరకే మందులను వ్యాపారులు విక్రయిస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఔషధాలధరలు తగ్గుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలుతోంది. కొన్ని కార్పోరేట్ మెడికల్ షాపులు తమ ధర ఇంతే అన్నట్టు విక్రయాలు చేస్తున్నారు. అధికారులు జీఎస్టీ తగ్గిందని షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. ధరల తగ్గింపునకు తీసుకుంటున్న చర్యలు మాత్రం కనిపించ లేదు. జీఎస్టీ తగ్గకముందు కొన్నవి ఉండటంతోనే దుకాణదారులు హోల్‌సేల్, రిటైల్ మందుల షాపుల వారు జీఎస్టీ మినహాయింపు ఇవ్వకుండా పాత ధరలతోనే ఇప్పటికీ విక్రయాలు చేస్తున్నారు. జీఎస్టీ ధర తగ్గింది కదా అని ఎవరైనా కొనుగోలుదారులు అడిగితే తమదగ్గరున్న నిల్వలు తక్కువ ధరకు అమ్మితే తాము నష్టపోతామని వాటిని పాత ధరకే అమ్ముతామంటూ వ్యాపారులు చెబుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం కొత్త జీఎస్టీని అమలు చేయాల్సిందేనంటూ ప్రకటనలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం ఆపరిస్థితి కన్పించడం లేదు. జీఎస్టీ తగ్గింపు ప్రచారం ఓ పండుగలా ప్రభుత్వం నిర్వహిస్తున్నా వాటి ఫలాలు ఇంకా వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. ఒక్కొక్క కుటుంబానికి అంత.. ఇంత.. ఆదా అయిందని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచారం చేస్తున్నారే తప్పా ఆచరణలో ఆ మిగులు ఇంకా ప్రజల దరి చేరలేదు.

జీఎస్టీ తగ్గినా.. దిగిరాని ధరలు..

జీఎస్టీ తగ్గించాం.. ధరలుతగ్గాయి కదా అని నిత్యావసరాల కొనుగోలుకు మార్కెట్ వెళ్తే అక్కడ కూడా ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. అన్ని షాపుల్లోనూ కంపెనీ వస్తువులను పాత ధరలకే విక్రయాలు చేస్తున్నారు. తాము కొనుగోలు చేసిన ధరలకే స్టాకు అయిపోయేంత వరకు పాత ధరకే విక్రయాలు సాగిస్తామని దుకాణదారులు చెబుతున్నారు. టూత్‌ఫేస్ట్ మొదలు గృహోపకరణ వస్తువులన్నీ ఇప్పటికీ పాత ధరలతోనే మార్కెట్లో విక్రయాలు జరుగుతున్నాయి. నూతన టారిఫ్ ప్రకారం 12 శాతం జీఎస్టీ ఉన్న వస్తువులు 5 శాతంలోకి వెళ్లాయి. ఈ సెక్టార్లో వ్యత్యాసం 7 శాతంగా ఉంది. దీన్ని బట్టి రూ.1000 వస్తువు కొనుగోలు చేస్తే రూ.70 తగ్గాలి. వాస్తవానికి ప్రస్తుత మార్కెట్‌లో ఇది ఎక్కడా అమలుకాలేదు. సామాన్యులు ఉపయోగించే బియ్యం, గ్యాస్, పప్పు, నూనెల ధరలు అలాగే ఉన్నాయి. కొన్ని ధరలు గతం కంటే పెరగడం విస్మయాన్ని కలిగించే అంశం.

ప్రచారానికే పరిమితం


జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందంటూ బస్టాండ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, కార్యాలయాలతో పాటు అన్ని చోట్ల అధికారులు పెద్ద ఎత్తున ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 25 నుంచి జీఎస్టీ ఉత్సవాల పేరుతో పెద్ద ఎత్తున కార్యక్రమాలనూ చేస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటున్నారు. ధరలు తగ్గించకుండా ఈ ఉత్సవాలు ఏమిటంటూ ప్రజలు నిట్టూర్పు విదిలిస్తున్నారు. పాత ధరలకే అన్ని నిత్యావసర వస్తువుల విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఏమి చేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పెనుకొండ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమం ప్రచారం చేస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులు(ఫైల్ ఫోటో)

తగ్గిన జీఎస్టీ అమలు చేయాలి

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తగ్గిన ధరలు అమలు కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ప్రచార ఆర్భాటమే తప్పా ధరల తగ్గింపు కనబడడం లేదు. ప్రచారం మాని తగ్గిన జీఎస్టీని తక్షణమే అమలు చేయాలి.

బాబా వలి, సిపిఎం నాయకులు.



కార్పొరేట్‌కు

ఆగని భూ పందేరం..!

- టాటా సోలార్, ఊర్జా వన్‌కు భూములు
- ఇప్పటికే 65 వేల ఎకరాలు కంపెనీల పరం
- తక్కువ ధరకే భూములు కొనేందుకు కంపెనీల కుట్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు ఆగడం లేదు. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 65 వేల ఎకరాలకుపైగా భూములు సోలార్ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారు. తాజాగా మరో రెండు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. టాటా పవర్, ఉర్జా వన్ అనే కంపెనీలకు ఈనెల 14వ తేదీన అనుమతులిచ్చింది. ఈ రెండు కంపెనీలు కూడా ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్ప, వజ్రకరూరు మండలాల్లో ఏర్పాటు చేయనున్నాయి.

బెళుగుప్పలో టాటాపవర్

బెళుగుప్ప మండలంలోని యర్రగుడి, ఆవులెన్న, సిరిపి, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గుపర్తి గ్రామాల పరిధిలో టాటా పవర్ కంపెనీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు 200 మెగావాట్లు, 560 ఎంపిడబ్లు డిసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఈ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇదివరకే ఈ మండలంలోని గంగవరం ప్రాంతంలో 400 మెగావాట్లకు అనుమతులిచ్చింది. ఇప్పటికే ఆ సంస్థ భూసేకరణను ప్రారంభించింది. ప్రభుత్వం ఉత్తర్వుల్లో లీజు పద్ధతిలో సేకరించుకోవాలని పేర్కొంది. లీజు ఎకరానికి ఏడాదికి రూ.31 వేలు అని చెబుతున్నప్పటికీ బెళుగుప్ప మండలంలో ఆ సంస్థ కారుచౌకగానే భూములను నేరుగా కొనుగోలు చేపట్టింది. ఎకరం రూ.4.50 లక్షల చొప్పన భూసేకరణ చేస్తుండటం గమనార్హం. నల్లరేగడి నేలలుండే ఈ మండలంలో మంచి పంటలు పండుతాయి. ఇక్కడ కూడా కార్పొరేట్ కంపెనీలు పాగా వేస్తున్నాయి. వేలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యాయి.

వజ్రకరూరులో ఉర్జావన్

వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల, గుళ్ళపాలెం, కమలపాడు గ్రామాల పరిధిలో ఉర్జావన్ అనే సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో దీని ఏర్పాటుకు అనుమతులిచ్చింది. ఇక్కడ కూడా అదే పరిస్థితులే కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం లీజు పద్ధతి అని అనుమతులిచ్చినప్పటికీ నేరుగానే సంస్థ భూములు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇది వరకే 250 మెగావాట్ల అనుమతులున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం భూములిచ్చేందుకు అనుమతులిస్తోంది. దీంతో రైతులు భూములు వదులకుని శాశ్వత వలసలు వెళ్లే పరిస్థితులు నెలకొనే అవకాశముందని పలువురు రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూములు ఇస్తున్న రైతులకు సరైన పరిహారం కూడా అందటం లేదని చెబుతున్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని పూర్తిగా పక్కనబెట్టి రైతులకు సరైన పరిహారం ఇవ్వకుండానే భూములు తీసుకుంటున్నట్టు విమర్శలున్నాయి.

కార్మికురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనారోగ్యంతో మృతిచెందిన అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు సుశీలమ్మ కుటుంబానికి గురువారం రూ.80వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ అనంతపురం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు సుశీలమ్మ అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమన్నారు. కార్మికులు అందరూ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వేతనంలో ఒకరోజు వేతనం ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. కాగా మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పిచడంతోపాటు ఎక్స్‌గ్రేషియా, ఇపిఎఫ్, ఇఎస్ఐ లాంటివి బెనిఫిట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సుశీలమ్మ కుటంబానికి ఆర్థికసాయం అందజేశారు. అలాగే సిఐటియు సిద్ధాంతాలు నచ్చి 1వ సర్కిల్‌లో జ్యోతి అనే కార్మికురాలు సిఐటియులో చేరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు కె.నాగభూషణం, మున్సిపల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు టి.గోపాల్, తిరుమలేష్, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, నగర ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నారాయణ, కోనప్ప, బంగ్లా రాఘవేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, శశీంద్రకుమార్, వరలక్ష్మి, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు చిత్తప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలో కుందుర్పి ఎంఇఒ హెచ్ఎం తిప్పేస్వామి, గోల్డెన్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జిన్స్ జేవియర్, పాఠశాల ఆర్థిక అడ్మినేటర్ ఫ్రాన్సిస్ జాన్ పీటర్ రూపేష్ చెకుముకి పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిత్తప్ప మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం జీవన విధానంగా ఉండేలా ప్రోత్సహించేందుకు జెవివి కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న తాలూకా స్థాయిలో, నవంబర్ 23న జిల్లాస్థాయిలో, డిసెంబర్ 12, 13, 14న రాష్ట్రస్థాయిలో సైన్స్ సంబరాలు నిర్వహిస్తారని, సైన్స్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెవివి నాయకులు నాగరాజు, రాజన్న, సోమశేఖర్, తిమ్మారెడ్డి, మాహంతేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగంలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల జెఎసి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయంలో కరపత్రాలు పంపిణి చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు జెఎసిగా ఏర్పడి సమ్మె చేపట్టాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటన నేపథ్యంలో విరామం ఇచ్చారని తెలిపారు. విద్యుత్ రంగంలో పని చేసే కార్మికులు నిత్యం ప్రమాదంతో కూడిన పని చేస్తుంటారని తెలిపారు. వారు ఒక పూట పని చేయకపోతే రాష్ట్రం మొత్తం అంధకారంలోకి పోతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పక్క రాష్ట్రం తెలంగాణ తరహాలో రాష్ట్రంలో కూడా కాంట్రాక్ట్ కార్మికులందరినీ సంస్థలోకి విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. గ్రా డ్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం, ప్రమాద బీమా రూ.కోటి చెల్లించాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పిఆర్‌సి కమిటీ వేయాలని, పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకట నారాయణ, ముర్తుజా, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు మధు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి ఎన్టీఆర్ శ్రీనివాసులు, అధ్యక్షులు ఆజాం, కోశాధికారి ఆదినారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు స్వాతి, బండారి స్వామి, బంగారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

హాస్టల్ వార్డెన్, అధికారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ కళాశాల బిసి హాస్టల్‌లో విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో వార్డెన్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నిర్లక్ష్యం పట్ల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎస్ఎఫ్ఐ, ఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం హాస్టల్ విద్యార్థులు పట్టణంలోని పాత మీసేవా కేంద్రం వద్ద ఉన్న బీసీ కాలేజీ బాలుర హాస్టల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ వార్డెన్ ఆనంద్ హాస్టల్‌లో సక్రమంగా ఉండటం లేదని, విద్యార్థులకు వేళకు భోజనం సరఫరా చేయడం లేదని, మలమూత్రశాలలు, స్నానపు గదులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. బియ్యం లో పురుగులు ఉన్నాయని, విద్యార్థులచే కూరగాయలు తరిగిస్తున్నారని, తాగునీరు తెప్పిస్తున్నారన్నారు. వీటిపై కలెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయించాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వార్డెన్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్‌రాయ్ సాయంత్రం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో విచారణ చేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు వసతి గృహంలో ప్రవేశం కల్పించాలని విద్యార్థులు కోరగా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వలి, గౌతమ్, అరవింద్, రాజు, మున్న, రాందాస్, బాలు హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పామిడి

మండలంలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, భవననిర్మాణ కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. ఈనెల 19న మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న మండల మహాసభకు సంబంధించిన కరపత్రాలను గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. ముఖ్యంగా బేల్దారులు, బేల్దారి కూలీలు, సిమెంటు కలిపే కూలీలు, బేల్దారుల సహాయకులు, రాడ్స్ బెండర్స్, పెయింటర్స్, ఇతర కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై మహాసభలో చరించనున్నట్లు తెలిపారు. కావున మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శివ, సాషు, మాబు, ముత్యాలు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల శిక్షణ తరగతులు

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద ఉన్న తృప్తి గ్రాండ్ ఫంక్షన్ హాలులో ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలోని గ్రామీణ విలేకరులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆయుఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించే శిక్షణ తరగతులను కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రారంభిస్తారని తెలిపారు. శిక్షణలో భాగంగా డెస్క్ కోఆర్డినేషన్, రూరల్ రిపోర్టింగ్, కృత్రిమ మేధ వినియోగం, డెవలప్మెంట్ జర్నలిజం, క్రైమ్ రిపోర్టింగ్, తదితర అంశాలపై పాత్రికేయ రంగంలోని నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు. రెండో రోజు జరిగే ముగింపు సభకు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన విలేకరులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు.

ప్రయివేటు బస్సుల దోపిడీ..!

- ఇష్టారాజ్యంగా ఛార్జీల వసూలు
- పట్టించుకోని అధికారులు
- ప్రత్యేక దినాల్లో మరింత రెచ్చిపోతున్న వైనం

ప్రజాశక్తి-రాయదుర్గం

సెలవులు, పండుగలు, వారాంతపు రోజులు ఉంటే చాలు ప్రయివేటు బస్సు సర్వీసులు ప్రయాణికులను దోపిడీ చేస్తున్నాయి. వారిని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వారి దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రాయదుర్గం కర్నాటక రాష్ట్ర సరిహద్దున గడినాడు ప్రాంతంలో ఉండగా అనేకమంది వృత్తి, వ్యాపార, ఉద్యోగ, వ్యవహారిక సంబంధాల కోసం నిత్యం కర్నాటకలోని బెంగళూరు, బళ్లారి, చిత్రదుర్గ, దావనగేరే, తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రధానంగా నిత్యం వందలాదిమంది బెంగళూరు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇక వారాంతపు రోజులు, పండుగలు, సెలవుల్లో అయితే మరింత ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. రాయదుర్గం నుంచి బెంగళూరుకు రోజూ రెండు రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇవి ప్రయాణికులకు అనువైన వేళల్లో లేవు. కెఎస్ఆర్టిసి నిత్యం 8 సర్వీసులు, ఎపిఎస్ఆర్టీసీ 2 సర్వీసులు నడుపుతున్నాయి. 4 ప్రైవేటు బస్సు సర్వీసులు ముఖ్యంగా రాత్రిళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఎపిఎస్ ఆర్టీసీ బస్సులో టికెట్ ఛార్జీ రూ. 325 కాగా, కెఎస్ ఆర్టీసీలో రూ. 380 వసూలు చేస్తారు. ప్రయివేటు బస్సుల్లో సాధారణ రోజుల్లో సీటర్‌కు రూ. 440, స్లీపర్ సీటుకు రూ. 500 ఛార్జీ ఉంటుంది. అదే వారాంతపు రోజులు, సెలవులు వస్తే ప్రైవేటు బస్సులకు పండగే. దీపావళి సందర్భంగా సీటర్‌కు రూ. 990, స్లీపర్‌కు రూ. 1300 నుంచి రూ. 2వేలు వసూరు చేస్తున్నారు. రోజూ ప్రయాణం చేసే అవే బస్సులు, అవే సీట్లు, స్లీపర్లు కాగా సందర్భాన్ని బట్టి ధరలు మారుతుంటాయి. ఈ రేట్లు కూడా ఆన్‌లైన్‌లోనే చూపబడతాయి. వీటిని ప్రశ్నించేవారు ఎవరూ లేరు. ఇదిలా ఉండగా ఒక ప్రయివేటు బస్సు నెల రోజుల వ్యవధిలో మూడుసార్లు ప్రమాదానికి గురైంది. ఓ బస్సు బెంగళూరు నుంచి అనంతపురం మీదుగా రాయదుర్గం రావాల్సి ఉంది. ఇటీవల ఆ బస్సు బెంగళూరు నుంచి అనంతపురం రాగా అక్కడే ఆపేశారు. అక్కడి నుంచి ప్రయాణికులను కారులో రాయదుర్గానికి తీసుకెళ్తామని తెలుపగా నిలదీసిన ప్రయాణికుడి పట్ల బస్సు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటు ఎపిఎస్ ఆర్టీసీ కానీ, అటు కెఎస్ ఆర్టీసీ కానీ ప్రయాణికుల సౌకర్యార్థం ఒక్క సూపర్ లగ్జరీ బస్సు కూడా నడపకపోవడం ప్రయివేటు బస్సుల యాజమాన్యాలకు కలిసొచ్చింది. సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేయాలని స్థానికులు దీర్ఘకాలంగా ఇరు రాష్ట్రాల రవాణా సంస్థలను కోరినా పట్టించుకునేవారు లేరు. దీంతో ప్రయివేటు బస్సు సర్వీసులు సందర్భాన్ని బట్టి ధరలను మారుస్తూ ప్రయాణికులను దోచుకుంటున్నారు. ప్రయాణికులు తమ అవసరాన్ని బట్టి గత్యంతరం లేక వాటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రయివేటు బస్సు ఛార్జీల దోపిడీని అరికట్టాలని, ప్రయాణికుల సౌకర్యార్థం రాయదుర్గం బెంగళూరు మధ్య రాత్రి వేళ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను ప్రవేశపెట్టాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ లక్ష్మీప్రసన్న తెలిపారు. పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీలో గురువారం పోషక మాసోత్సవం నిర్వహించారు. సిడిపిఒ లక్ష్మీప్రసన్న, అర్బన్ పిహెచ్‌సి వైద్యురాలు అమృతవర్షిణి, సూపర్‌వైజర్ రాధా పోషకాహారంపై తెలియజేశారు. కార్యక్రమంలో రీడ్స్ స్వచ్ఛంధ సంస్థ మేనేజర్ మహేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాతక్క, వరలక్ష్మి, తులసి, భారతి, లక్ష్మి, వరలక్ష్మి, భారతమ్మ, టీడీపీ నాయకులు రమేష్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్


మున్సిపాలిటీలో పరిధిలోని ముదిగల్లు గ్రామంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

తాగునీటి కార్మికుల సమస్యలు పట్టవా.?

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర ప్రశ్నించారు. కార్మికుల సమస్యలపై గురువారం స్థానిక సంప్‌హౌస్ వద్ద సమావేశం నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ వేతనాల్లో కోత విధిస్తామని, ఉద్యోగాలు తొల గిస్తామని కార్మికులపై కాంట్రాక్టర్ల బెదిరింపులు మానుకోవాలన్నారు. కార్మికులకు ఇది వరకూ ఈపిఎఫ్, ఈఎస్ఐలతో కలిపి రూ. 18,200 వేతనం పొందేవారని, కూటమి ప్రభుత్వంలో కొత్త కాంట్రాక్టర్లు రావడంతో వేతనం రూ. 11,200 చెల్లిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఈ వేతనంతో పని చేయకపోతే ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలని చెప్పడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు ఏజెన్సీలు తీసుకుని కార్మికుల పొట్టగొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ కార్యాలయ సిబ్బంది సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాగునీటి పథకం యూని యన్ నాయకులు వన్నూరుస్వామి, నరేష్, ఓబుళపతి, తిప్పేస్వామి, గంగాధర్, శెట్టూరు నరేష్, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ఘనంగా ప్రపంచ అనస్థీషియా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి అనంతపురం

ప్రపంచ అనస్తీసియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనస్తీసియా విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయశ్రీ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆధునిక శస్త్ర చికిత్సల్లో నొప్పిని నివారించడంలో అనస్తీషియా ఎంతో కీలకపాత్ర వహిస్తుందన్నారు. అనస్తీషియా వైద్యుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అనస్తీసియా విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ టి.మధుసూదన్, జి.శ్రీహరిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పద్మాబాయ్, గంగాధర్‌రెడ్డి, ఎదుభూషణ్, వేమననాయక్, సోమశేఖర్, హరికృష్ణ, జ్యోత్స్న, తులసి, శేలియా డేని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లలితభవాని, డాక్టర్ సుమన గోపీచంద్ పాల్గొన్నారు. ర్యాలీలో అనస్తీషియా పీజీలు, వైద్య విద్యార్థులు, గవర్నమెంట్ నర్సింగ్ విద్యార్థులు మరియు టెక్నీషియన్లు పాల్గొన్నారు.

‘అనంత’ మార్కెట్ యార్డు ఛైర్మన్ పీఠం

దక్కేదెవరికో..!

పెరుగుతున్న ఆశావహులు

ఏడాదిన్నర కావస్తున్నా సాగదీస్తున్న ప్రభుత్వం

పాలకవర్గం లేక కుంటుపడుతున్న అభివృద్ధి



ఏడాదిన్నరగా అభివృద్ధి నిల్..

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం మార్కెట్ యార్డు ఛైర్మన్ పీఠం ఎవరికివ్వాలో ప్రభుత్వం తేల్చులేకపోతోంది. పురుషులకు ధీటుగా ఛైర్మన్ పోస్టులకు మహిళల నుంచి కూడా పోటీ తీవ్రంగా ఉంది. గతంలో రాయల్‌మురళి, బల్లా పల్లవి పేర్లు మాత్రమే వినిపించగా ప్రస్తుతం మూడింతల డిమాండ్ పెరిగిందని చెప్పవచ్చు. పురుషుల జాబితాలో టిడిపి సీనియర్ నాయకులు బుగ్గయ్య చౌదరి, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, కోనంకి గంగారాం పేర్లు వినపడుతున్నాయి. ఇక మహిళల విభాగం నుంచి మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, సీనియర్ లీడర్ మాజీ కార్పొరేటర్ జయరామ్‌నాయుడు సతీమణి హరిత, కొండవీటి భావన పేర్లు వినిపిస్తున్నాయి. పోటీ తీవ్రంగా ఉండటంతో అధిష్టానం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికి పలుమార్లు ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సర్వే కూడా చేశారు. అయినా ఛైర్మన్ గిరిపై తెల్చలేకపోయింది.

ప్రస్తుతం మార్కెట్ యార్డులో చీనీ విక్రయాలు, పశువులు, గొర్రెలు, మేకల సంతలు నిర్వహిస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు గత ప్రభుత్వంలో చేపట్టినా కవరింగ్ షెడ్డు నిర్మాణం మాత్రం సగంలో నిలిచిపోయింది. అలాగే దుకాణాల నిర్మాణాలు కూడా సగంలోనే నిలిచిపోయాయి. ఆయా పనులను కాంట్రాక్టర్ బిల్లులు రాక నిలిపివేసినట్లు తెలుస్తోంది. మళ్లీ టెండర్లు పిలిచినా పాత వాటికే బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు ముందుకు రానట్లు సమచారం. పాలకవర్గం ఉంటే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంటుంది. ఇక కార్యదర్శి కూడా కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో మార్కెటింగ్ ఎడికి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ఇచ్చారు. ఆయన అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించలేకపోయినట్లు తెలుస్తోంది. ఇక సూపర్‌వైజర్లు కనిపించడం లేదు. ఏదిఏమైనా కార్యదర్శి ఇన్‌ఛార్జి, పాలకవర్గం లేక యార్డు అభివృద్ధి ‘ఎక్కడ వేసిన గొంగళి అక్కడే’ అన్న చందంగా మరిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అనంతపురం మార్కెట్ యార్డు నూతన పాలకవర్గాన్ని నియమించి యార్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

హైస్కూల్ తనిఖీ

అనంతపురం సిటీ : నగరంలోని పాపంపేటలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌ను డిఇఒ ప్రసాద్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పతిష్ట పరిచే విధంగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

ఇండియా స్కూల్ ర్యాంకింగ్‌లో

అనంత ‘ఎజిఎస్’కు ఐదో ర్యాంకు

రెస్పాండెంట్ సాల్మన్‌రాజ్


అవార్డును అందిస్తున్న ఇండియా స్కూల్ ర్యాంకింగ్ అవార్డుల ప్రతినిధి బృందం

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియా స్కూల్ ర్యాంకింగ్‌లో నగరంలోని ఎజిఎస్ అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్ ఐదో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సంస్థ కరస్పాండెంట్ సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ ఇది గొప్ప విజయం అన్నారు. స్ఫూర్తిదాయకమైన, ప్రభావవంతమైన ప్రయాణం వెనుక ఉన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపే క్షణం అన్నారు. ఢిల్లీలోని నేషన్స్ ప్రధాన కార్యాలయంలో ఎడ్యుయాక్టుయాన్ వరల్డ్ ద్వారా సత్కారం అందుకోవడం గర్వంగా ఉందన్నారు. తనతోపాటు తన బృందానికి మద్దతుగా నిలిచి, వరుసగా నాలుగోసారి రాష్ట్రస్థాయిలో నిలబడేలా చేసిన వారందరికీ రుణపడి ఉంటానన్నారు. 2022లో 8వ ర్యాంకు, 2023లో 7 వ ర్యాంకు, 2024లో 5 వ ర్యాంకు, 2025లో ఎడ్యుకేషన్ వరల్డ్ మ్యాగజైన్ ద్వారా కో-ఎడ్ స్కూల్స్ కింద రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ విజయం యాజమాన్యం సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులకు చెందుతుందన్నారు.

కోటి సంతకాల సేకరణ


మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-శింగనమల

గార్లదిన్నె మండల కేంద్రంలోని మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గార్లదిన్నె మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నియోజవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజానాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె పరిశీలకులు తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, శింగనమల మండలం పరిశీలకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యులు, నీలం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఖజానా శాఖ డిడిగా జి.రమణయ్య



అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా గుర్రం రమణయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు గురువారం జిల్లా వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దీంతో శాఖ ఎటిఒ, ఎస్‌టిఒలు, అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్ఇఒగా త్యాగరాజు



అనంతపురం : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాస్ మీడియా విభాగంలో డిప్యూటీ డెమోగా పని చేస్తున్న ఎం.త్యాగరాజు ఉద్యోగోన్నతిపై ఇదే కార్యాలయంలో పిఒడిటి విభాగంలో హెల్త్ ఎడ్యుకేషన్, ఎక్సటెన్షన్ ఆఫీసర్‌గా (హెచ్ఇఒ) పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పిఒడిటి సురేష్‌బాబును కలిసి రిపోర్ట్ చేశారు. త్యాగరాజును జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి, కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

అనంతపురం : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ పుష్పావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18 తేదీన కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

జాతీయస్థాయికి ‘జీషాన్’ ఎంపిక

అనంతపురం సిటీ : 16వ సౌత్‌జోన్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా కేరళ త్రివేండ్రంలోని వట్టియూర్కవు షూటింగ్ రేంజ్‌లో నిర్వహించిన పోటీల్లో అనంతపురంలోని ఆర్యన్ షూటింగ్ అకాడమీకి చెందిన జీషాన్‌ఖాన్ 10 మీటర్ పిస్టల్ యూత్, సబ్ యూత్ విభాగంలో అర్హత సాధించాడు. 11 నుంచి అక్టోబర్ 14 వరకూ జరిగిన పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీకాంత్ తెలిపారు.

పోషణ మాసోత్సవం


చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

పామిడి : స్థానిక దుర్గమ్మ వీధి అంగన్వాడీ సెంటర్-2లో అంగన్వాడీ టీచర్ జెఎల్ నారాయణమ్మ ఆధ్వర్యంలో గురువారం పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజనం ముందు.. భోజనం తర్వాత.. వంట చేయకముందు, వంట చేసిన తర్వాత, మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ప్రేమకుమారి, ఆయా, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచి ప్రకృతిని కాపాడుదాం


మొక్కలను నాటుతున్న చిన్నారులు

అనంతపురం : మొక్కలను పెంచి ప్రకృతిని కాపాడుకుందామని ప్రముఖ సైకాలజిస్ట్, ది ఐడియల్ లివింగ్ వ్యవస్థాపకులు ఎలుగు సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఎస్‌కెయు వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 10 రోజుల ‘బ్యాగ్లెస్ డేస్’లో భాగంగా ‘చెట్ల పెంపకం-ప్రకృతి సంరక్షణ’పై అవగాహన సెమినార్, మొబైల్ అడిక్షన్‌పై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి వందకుపైగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానచార్యులు మార్కండేయులు, భాస్కర్, అధ్యాపకులు సాయిరామ్, లలిత్, వినోద్, సుహాసిని, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్వేత

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఉమెన్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం గర్భాశయ క్యాన్సర్, హెచ్‌పివి వ్యాక్సిన్ ద్వారా క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గైనకాలజిస్టు డాక్టర్ ఎం.శ్వేత మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో మహిళలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వాటిలో ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్న వారిసంఖ్య ఏటా పెరుగుతూనే ఉందన్నారు. కావున ప్రతి మహిళా దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కావున ముందస్తు రోగ నిర్ధారణ, తక్షణ వైద్య సంరక్షణ చాలా ముఖ్యమైనవన్నారు. ప్రారంభ దశలో రోగనిర్ధారణ చేసినప్పుడు, చికిత్స సులభం అవుతుందన్నారు. ఈ వ్యాధి నుంచి రక్షణ పొందడానికి ముందస్తు జాగ్రత్తగా హెచ్‌పివి వ్యాక్సిన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు, ఉమెన్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ మాధవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కిసాన్‌డ్రోన్ వినియోగంపై అవగాహన


మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-నార్పల

కిసాన్‌డ్రోన్ పరికరాల వినియోగం, ప్రయోజనాలపై గురువారం మండలంలోని గొల్లపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ కిసాన్ డ్రోన్ సాంకేతికత గురించి వివరించారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఎరువులు, మందులను సమానంగా పిచికారీ చేయవచ్చన్నారు. ఫలితంగా రైతులకు వ్యయం తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుందన్నారు. రసాయనాలతో నేరుగా సంబంధం లేకుండా ఆరోగ్య రక్షణ కలుగుతుందన్నారు. తర్వాత జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాల గురించి రైతులకు వివరించారు. ఎఫ్‌పీవో ప్రతినిధులు రైతులకు డ్రోన్ సేవల అందుబాటు, సబ్సిడీ పథకాలు, డ్రోన్ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమాలపై వివరించారు. అనంతరం కిసాన్ డ్రోన్ ద్వారా ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.చన్నవీరస్వామి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నార్పల బ్రాంచి మేనేజర్ పి.సందీప్, ఎపిఎం తిప్పమ్మ, నార్పల ఉద్యాన శాఖ అధికారి నెట్టికంటయ్య, ఎఫ్‌పిఒ ప్రతినిధులు షర్మిల, హసీనా, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

‘సీమ’కు జాతీయ ప్రాజెక్టులు మంజూరు చేయాలి

రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జునరెడ్డి



ప్రజాశక్తి-తాడిపత్రి

తుంగభద్ర, కృష్ణా వరద జలాలను రాయలసీమ ప్రాంతానికి తీసుకొచ్చేందుకు జాతీయ నీటి ప్రాజెక్టులను రాయలసీమ ప్రాంతానికి మంజూరు చేయాలని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమలోని రైతులు వరుస కరవులతో అల్లాడిపోతూ వలసలు వెళ్తున్నారన్నారు. అరకొర పంటలు పండించిన రైతులు గిట్టుబాటు రేట్లు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతుల భూములను కారుచౌకగా తీసుకుని సోలార్, విండ్ పవర్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేస్తూ కనీసం పశువులు, గొర్రెలను మేపుకోవడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నారన్నారు. అంతేగాకుండా ఇక్కడి రైతులను సోలార్ ప్యానెల్ కడగడానికి, వాటి కింద గడ్డి కోయడానికి కూలీలుగా మారుస్తూ కార్పొరేట్ వ్యాపార కంపెనీల కోసం రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. తమకు సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు కాదని, తుంగభద్ర, కృష్ణానదులపై జాతీయ ప్రాజెక్టులను నిర్మించి రాయలసీమను నీటితో తడపాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : సిఐటియు



పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్యుత్ శాఖలో దశాబ్దాల కాలంగా కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, సంస్థ రక్షణ కోసం ఈనెల 17వతేదీ నుంచి జరిగే విద్యుత్ సమ్మెలో నేపథ్యంలో గురువారం స్థానిక విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. జెఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేసి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు 4 పెండింగ్ డిఎలను విడుదల చేయాలన్నారు. పీఆర్సి కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికులు అందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం ఇవ్వాలని, 22 పిఆర్‌సి యరియర్స్ ఇచ్చి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న నాన్‌రెగ్యులర్ ఉద్యోగులందరినీ అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం రూ.కోటి బీమా పథకం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలో ప్రయివేటీకరణ విధానాలను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్‌లో అమ్మాయిల సత్తా

అనంతపురం : అనంతపురంలోని డిఎస్ఎ స్టేడియంలో గురువారం అండర్-19 వాలీబాల్ జిహెచ్ఎస్ ఎన్‌టి జిల్లా సెలెక్షన్స్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీవాసరెడ్డి, ప్రవీణ్‌బాబు, రమేష్, రాజమ్మ, విజయలక్ష్మి, నరేంద్రారెడ్డి, లతదేవి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సానుకూల దృక్పథంతో మెలగాలి

ఎస్వీ డిగ్రీ, పీజికళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి


తిలకిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు సానుకూల దక్పథంతో మెలగాలని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి సూచించారు. గురువారం నగరంలోని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో ఫుడ్ సైన్స్, టెక్నాలజీ, బయోటెక్నాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ‘హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫర్ బెట్టర్ ఫ్యూచర్’ అనే థీమ్‌తో ప్రపంచ ఆహార దినోత్సవం 2కె 25 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌కెయు బయోటెక్నాలజీ విభాగ ప్రొఫెసర్, మైక్రోబయాలజీ హెడ్, బోస్ ఛైర్‌పర్సన్ ఎస్.అనిత మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథంతో జీవించడంతోపాటు హానికరమైన ఆహారపు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ధ్యానం (మెడిటేషన్) ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం పట్ల శ్రద్ధ చూపాలని, సరైన ఆహారపు నియమాలు పాటించడం ద్వారా విద్య, జీవితంలో విజయవంతం అవ్వవచ్చన్నారు. ఈ సందర్భంగా అనేక కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌ఎవి ప్రసాద్, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఎస్.రిజ్వానా, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి జి.సాయిప్రీతి, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శివసాయి విగ్రహానికి ప్రపంచ స్థాయి గుర్తింపు


శివ సాయిబాబా విగ్రహం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలోని శివ సాయిబాబా విగ్రహానికి ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కింది. ఈమేరకు గురువారం శివ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సభలో ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిలా సాయినాథునిగా ధ్రువీకరించిన సర్టిఫికెట్‌ను సంస్థ ప్రతినిధులు మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. పట్టణంలోని సంజీవనగర్ 5వ రోడ్డులో ఉన్న శివసాయి ఆలయంలో మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సుమారు 9.5 అడుగుల ఎత్తుతో 7 టన్నుల బరువుతో సాయిబాబా ఏకశిలతో విగ్రహాన్ని ప్రతిష్టించిన విషయం తెలిసిందే. ఈ విగ్రహానికి ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిలా సాయినాథుని విగ్రహంగా ధ్రువీకరించడం విశేషం.

రోడ్డు విస్తరణకు సహకరించండి :కలెక్టర్


భూబాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ కోరారు. గురువారం మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామం పర్యటించిన కలెక్టర్ భూ బాధితులతో మాట్లాడారు. రోడ్డు విస్తీర్ణంలో భాగంగా ఇళ్లు, భూములను కోల్పోయిన వారు గృహ సముదాయాలు, ఇళ్లను ఖాళీ చేయాలని కోరారు. ఇంకా పరిహారం అందని వారు ఉంటే వీలైనంత త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలో ఎ.కొండాపురం గ్రామంలో ఎన్‌హెచ్ రోడ్డు పనులు కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం పరిశీలించారు. కొండాపురం గ్రామంలో కొంతమంది రైతులు ఇంటిని నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆర్డర్స్ రావడంతో ఇంటిని తొలగించేందుకు యజమానులతో మాట్లాడి తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కేశవనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్‌బాషా, వీఆర్వో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం


అవగాహన కల్పిస్తున్న అతిథులు

రాప్తాడు : లింగ నిర్ధారణతోపాటు లింగ వివక్షకు పాల్పడితే చర్యలు తప్పవని సిహెచ్ఒ శివప్రసాద్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ‘బాలికల రక్షణ’ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో ఆడపిల్లలను రక్షించడం ఒకటి అన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులను సమంగా చూడాలన్నారు. అప్పుడే లైంగిక వేధింపులు, అత్యాచారాలు ఉండవన్నారు. ముఖ్యంగా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ ముత్యాలమ్మ, ఎంపిహెచ్ ఎస్.అరుణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హేమలత, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ, ఎంపిహెచ్ఎ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


పరిశీలిస్తున్న జెడ్పీ సిఇఒ శివశంకర్

ప్రజాశక్తి-ఆత్మకూరు

సచివాలయ సిబ్బంది సమయానికి అనుగుణంగా విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని జిల్లా పరిషత్ సిఇఒ బి.శివశంకర్ ఆదేశించారు. గురువారం మండలంలోని గొరిదిండ్ల గ్రామ పంచాయతీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే రోజూ తప్పనిసరిగా హాజరు నమోదు ఉండాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ తయారవుతున్న వర్మీ కంపోస్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సర్పంచు నాగరత్నమ్మ, పోతన్న మాజీ జడ్పిటిసి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-గుత్తి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పుట్టినరోజు పురస్కరించుకుని గుత్తిలోని ప్రభుత్వాసుపత్రిలో తురకపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయ్ భరత్‌కుమార్‌రెడ్డి గురువారం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి యల్లప్ప, టిడిపి నాయకులు బి.నాగిరెడ్డి, నారాయణ, హనుమంతురెడ్డి, మహేష్ కుమార్, బోయ శంకర్, నాగేశ్వర్ రెడ్డి, స్టోర్ డీలర్లు జైపాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి జి.తిరుపాల్, నరేష్ కుమార్, వెంకటేష్, నల్లప్ప,రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తూరు లోని స్వీట్ సెవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన అనాథ, వృద్ధాశ్రమంలో టిడిపి నాయకుడు బోర్ వెల్ నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముందుగా మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు.